క్లుప్తంగా

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని మమతా రోడ్ సబ్ స్టేషన్‌లో నూతన ఎంవీఏ పీటీఆర్ నిర్మాణ పనుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈడీ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఖానాపురం, మమతా రోడ్, అల్లిపురం సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

కేసీఆర్ బస్సు యాత్ర విజయవంతం

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో జరిపిన బస్సుయాత్ర విజయవంతమైందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజీనామా..

కామేపల్లి: బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, మండలాధ్యక్ష పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌కు తన రాజీనామా లేఖను పంపించినట్లు హనుమంతురావు తెలిపారు. పార్టీలో తనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. భారీ ఎత్తున తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉచిత న్యాయ సేవలు

ఖమ్మం లీగల్: ప్రతీ కార్మికుడు తన హక్కుల గురించి తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు తెలిపారు. కార్మిక దినోత్సవం సందర్భంగా రోటరీనగర్ ఆటో యూనియన్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే పథకాల గురించి వివరించారు. కార్మికుల చట్టాలు, హక్కులు, కనీస వేతనాలు, బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడం, 14 ఏళ్ల లోపు ఉన్న వారిని పనిలో పెట్టుకోకుండా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎం.వలరాజ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ టి.శ్రీను, గాంధీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి

ఖమ్మం మామిళ్లగూడెం: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీచేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆధార్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఈడా శేషగిరిరావు గౌడ్ కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నేపథ్యంకలిగిన కుటుంబంతో పాటు ఉన్నత విద్యావంతుడినైన తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నాగయ్య, శ్యామ్‌నాయక్, జమీల్, అజయ్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల ప్రచారం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి వినీలరావు, పలువురు పార్టీ నాయకులు బుధవారం ఇంటింటిప్రచారం చేశారు. వినోద్‌రావును గెలిపించి పార్లమెంట్‌కు పంపాలంటూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు, నాయకులు మండడపు ప్రభాకర్‌రెడ్డి, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, వంశీ, బోళ్ల భిక్షపతి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చేపల వేటపై కొనసాగుతున్న ఉత్కంఠ

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల మధ్య వివాదం తెగడం లేదు. చెరువులో చేపల వేట విషయమై ఇరువర్గాలు పట్టుబడుతుండడంతో ఏ నిర్ణయానికి రాలేకపోతున్నారు. కూసుమంచి సీఐ జనార్దన్, నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు ఆధ్వర్యాన బుధవారం సొసైటీ సభ్యుల సమావేశం నిర్వహించగా.. రాజకీయ పార్టీల నాయకులు రావడంతో రసాభాసగా మారింది. సొసైటీ సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు తామంటే తామే చేపలు పడుతామని తోపులాటలకు దిగారు. దీంతో సీఐ జోక్యం చేసుకుని ఇరువర్గాలను వారించి ఎన్నికల తర్వాతే చేపల వేటపై ఆలోచించాలని ఆదేశించారు. అయితే, ఎండ తీవ్రత, నీటి కొరత కారణంగా చెరువులో చేపలు మృత్యువాత పడతాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

ఖమ్మంవ్యవసాయం: అధిక లోడ్‌ను అధిగమించేందుకు నగరంలోని టౌన్–1 సెక్షన్ పరిధిలో రూ.8 లక్షలతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో విద్యుత్ అంతరాయాలను నియంత్రించటం కోసం సారధినగర్, వెంకటేశ్వరనగర్ ఎఫ్‌సీఐ గాదాముల వద్ద ఈ ట్రాన్స్‌ఫారాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. బుధవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లను ఖమ్మం డివిజన్ డీఈ నంబూరి రామారావు, ఏడీఈ సీహెచ్ నాగార్జున, టౌన్–1 మౌలిక పర్యవేక్షించారు.

అరుణ పతాకం రెపరెపలు

ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

కార్మికుల కష్టానికి ఫలితం దక్కినరోజు, పోరాట స్ఫూర్తిని నింపిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ (మే డే) వేడుకలను వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరూవాడా జెండాలను ఆవిష్కరించి, శ్రమజీవుల కృషిని స్మరించుకుంటూ నాయకులు ఘన నివాళులర్పించారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. కార్మికుల హక్కులను సాధించే దిశగా సంఘటితం కావాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: అమరులకు జోహార్లు అర్పిస్తున్న టీఎస్‌యూటీఈయూ నాయకులు



ఖమ్మంమయూరిసెంటర్: అరుణ పతాకాన్ని ఎగురవేస్తున్న న్యూడెమోక్రసీ నాయకుడు మధు



ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం జిల్లా కార్యాలయంలో మే డే వేడుకలు



కామేపల్లి: తాళ్లగూడెంలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ జిల్లా నాయకుడు కృష్ణయాదవ్, తదితరులు



తిరుమలాయపాలెం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన నాయకులు



ఖమ్మం సహకారనగర్: జెండాను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



కూసుమంచి ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు, కార్మికులు



ఖమ్మం మామిళ్లగూడెం: జెండా ఎగుర వేస్తున్న తెలంగాణ మాదిగ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



రఘునాథపాలెం: శివాయిగూడెం సెంటర్‌లో జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



నేలకొండపల్లి: మంగాపురంలో..



ఖమ్మంఅర్బన్: బల్లేపల్లిలో.. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన వేడుకలు



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం డిపో వద్ద ఈయూ ఆధ్వర్యాన వేడుకలు

ఖమ్మం మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా..

- మే డే సభలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఐఎన్‌టీయూసీలో పలువురి చేరిక



ఖమ్మం మార్కెట్‌లో ప్రదర్శనలో మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం మార్కెట్ వద్ద బుధవారం నిర్వహించిన మే డే వేడుకలో మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేయగా, బీఆర్‌ఎస్‌కేవీకి చెందిన పలువురు కార్మికులు నున్నా మాధవరావు ఆధ్వర్యాన ఐఎన్‌టీయూసీలో చేరారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ రూ.100 కోట్ల వ్యయంతో ఖమ్మం మార్కెట్ రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి: పొంగులేటి

ఖమ్మంఅర్బన్: ప్రముఖ నటుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని టీడీపీ కార్యాలయానికి ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి వెళ్లిన ఆయన ఎన్నికల్లో తమ అభ్యర్థికి మద్దతు తెలపాలని టీడీపీ నాయకులను కోరారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్న పోస్ట్ కార్డు ఉద్యమానికి మద్దతు తెలిపిన ఆయన కార్డులపై సంతకాలు చేసి పోస్టు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అనేక మందికి ఎన్టీఆర్ రాజకీయ జీవితం కల్పించారని, తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్, రాజశేఖర్‌రెడ్డి చిరస్థాయిగా ప్రజల గుండెల్లో ఉంటారని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ నాయకులు మువ్వా విజయ్‌బాబు, బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని బేబి స్వర్ణకుమారి, ఎండీ.ముస్తఫా, కొప్పుల చంద్రశేఖర్‌రావు, బానోత్ ఉత్తేజ్, కేతినేని హరీష్, వాసిరెడ్డి రామనాథం పాల్గొన్నారు.

కార్మికుల కష్టంతోనే దేశప్రగతి..

ఖమ్మంవన్‌టౌన్: కార్మికుల కష్టంపైనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని.. ఇందులో భాగంగా కార్మికుల సంక్షేమానికి మం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కార్మిక దినోత్సవం సందర్భంగా గాంధీచౌక్ పోస్టాఫీస్ సెంటర్‌లో వారు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, నాయకులు ఏర్నేని రామారావు, నాగండ్ల దీపక్‌చౌదరి, నరేష్, విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాడుతా..



మాట్లాడుతున్న రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మంరూరల్: కార్మికుల హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాడతానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఏదులాపురంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ అరాచక పాలనకు ఇండియా కూటమి గెలుపు ద్వారా చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దండి సురేష్, మిడకంటి చిన వెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని గెలిపించాలి

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకల నరేష్‌రెడ్డి, కాంగ్రెస్ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు కోరారు. బుధవారం సాయంత్రం ఓ హోటల్‌లో ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం మండల కోఆర్డినేటర్లు, కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో నరేష్‌రెడ్డి, 25వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సింహారావులు మాట్లాడారు. రఘురాంరెడ్డిని గెలిపించి ఖమ్మం అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఈ సమావేశాల్లో తుంబూరు దయాకర్‌రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళీ, మహ్మద్ జావీద్, ఎర్రం బాలగంగాధర తిలక్, కల్వకుంట్ల గోపాల్, తల్లాడ రమేష్, నల్లమల ఆనంద్, గుత్తా వెంకటేశ్వరరావు, దాసరి పూర్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్, శంకర్, నాగిశెట్టి కృష్ణ, నాగభూషణం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే అలాగే మతతత్వ బీజేపీ, అహంకార బీఆర్ఎస్ పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని ఓయూ జేఏసీ కోరింది. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ పి.రమేష్‌తో పాటు టీపీసీసీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎం.రవి మాట్లాడుతూ.. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో శ్రీను, మధు, లాల్, విజయ్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన పలువురు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం గాంధీచౌక్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను బుధవారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కలిశారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన సంభాని మర్యాదపూర్వకంగా భట్టిని కలిసి పలు అంశాలపై చర్చించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ అభ్యర్థులు రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి సోనియాగాంధీకి కానుకగా ఇవ్వాలని సంభానికి డిప్యూటీ సీఎం సూచించారు. అలాగే, ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు.



డిప్యూటీ సీఎం భట్టితో నాగబత్తిని రవి

ఈసందర్భంగా కళాక్షేత్రంలోని సమస్యలను వివరించి అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరగా.. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని రవి తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం..

కామేపల్లి: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. బుధవారం పాతలింగాలలో మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6న కొత్తలింగాల గ్రామంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా నిర్వహించనున్న బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం కామేపల్లి సొసైటీ డైరెక్టర్లు దేవండ్ల యాదగిరి, భట్టు రమేష్ బీఆర్ఎస్ పార్టీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పగడాల మంజుల, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, గుజ్జర్లపూడి రాంబాబు, ఏపూరి మహేందర్‌కుమార్, పుచ్చకాయల కృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు, ఏపూరి లతాదేవి, దుగ్గి కృష్ణ, ఇంజం నాగభూషణం, కిలారు కృష్ణయ్య, ఆరెం రవి పాల్గొన్నారు.

శివుడు వెలిశాడంటూ ప్రచారం!

కూసుమంచి: మండలంలోని గంగబండతండా సమీపంలోని ఓ బండరాయిపై శివుడు వెలిశాడంటూ బుధవారం ప్రచారం సాగింది. తండాకు చెందిన ఓ బాలిక కలలో శివుడు తాను బండమీద వెలుస్తున్నానని చెప్పాడని, అట్టి బాలిక చెప్పిన మాటలతో గ్రామస్తులు ఆ బండ వద్ద పూజలు చేశారు. ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కాగా జనం అక్కడకు వచ్చి చూసి వెళ్లారు.

సత్కారం



గణేష్ దంపతులను సత్కరిస్తున్న సీపీ, అధికారులు

ఖమ్మంక్రైం: పదవీ విరమణ వృత్తికే కాని వ్యక్తిత్వానికి కాదని సీపీసునీల్‌దత్ అన్నారు. అడిషనల్ డీసీపీ (సీటీసీ)గా పనిచేస్తున్న పీవీ గణేష్ పదవి విరమణ సందర్భంగా బుధవారం రాత్రి బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గణేష్‌ను పూలమాలలతో సత్కరించి పోలీస్ శాఖకు చేసిన సేవలను సీపీ కొనియాడారు. అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, విజయబాబు, ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ మల్కిత్ సింగ్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు, శ్రీనివాసులు, ప్రసన్నకుమార్, వెంకటేష్, సాంబరాజు, భోజరాజు, మల్లయ్య, ఫణీంద్ర, నర్సయ్య, సుశీల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం



భవ్యను సన్మానిస్తున్న బాలరాజు, రాజేష్

కామేపల్లి: మండలంలోని ముచ్చర్లకు చెందిన దేవండ్ల భవ్య ఎస్సెస్సీ ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా భవ్యతో పాటు ఆమె తల్లిదండ్రులను బుధవారం వ్యవసాయ శాఖ ఉద్యోగి ధనూరి బాలరాజు–నాగమణి, శ్రీ సాయి ఫర్టిలైజర్స్ నిర్వాహకులు నర్సింగ్ రాజేష్ ఆధ్వర్యాన సన్మానించారు. అలాగే, రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవండ్ల సీతారాములు, ధనలక్ష్మి, ఆత్మకూరి రాజేష్,పొన్నం లక్ష్మీనారాయణ, చల్లా కాంతారావు, దేవండ్ల రమణయ్య పాల్గొన్నారు.

పచ్చదనం.. బుగ్గిపాలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని కట్టలమ్మ చెరువు కట్టపై ఉన్న పచ్చదనం ప్రమాదవశాత్తు మంటలకు ఆహుతైంది. బుధవారం చెరువు కట్ట మూలమలుపు వద్ద అలుముకున్న మంటలు ఈదురుగాలులకు కట్టపై ఉన్న పచ్చని చెట్లతో పాటు వివిధ మొక్కలను దహించివేశాయి. విషయం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

మే డే సందర్భంగా కవి సమ్మేళనం

ఖమ్మంగాంధీచౌక్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యాన నగరంలోని బస్‌డిపో రోడ్ లోని ఓ అపార్ట్‌మెంట్‌లో సంస్థ కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ.. శ్రామిక వర్గ పక్షపాతమే సాహిత్య లక్ష్యంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సంస్థ అధ్యక్షుడు విజయరామరాజు, సంస్థ గౌరవ అధ్యక్షుడు బుక్కా సత్యనారాయణ, సాహితీవేత్తలు యన గండుల దేవయ్య, గద్దం వెంకటనర్సయ్య, కొంపెల్లి రామయ్య, కాంతేశ్వరరావు, నరసయ్య, రాఘవులు, రామారావు, జయవాసు, కొత్త శంకర్ రెడ్డి, శోభనాద్రి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా, బుక్క సత్యనారాయణ జన్మదినం సందర్భంగా 'అన్నం'ఫౌండేషన్‌లో అనాథలకు అన్నదానం చేశారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రఘునాథపాలెం: శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు తెలిపారు. కేంద్ర పోలీసు బలగాలతో రఘునాథపాలెంలో బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే నేరచరితులను బైండోవర్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఏసీపీ రమణమూర్తి, సీఐలు శ్రీహరి, భానుప్రకాశ్, ఉదయ్ కుమార్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే దివ్యాంగులకు న్యాయం



ర్యాలీని ప్రారంభిస్తున్న వీరయ్య, పక్కన జావీద్

ఖమ్మంవన్‌టౌన్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దివ్యాంగులకు చేసిందేమి లేదని, కాంగ్రెస్ పాలనలోనే దివ్యాంగులకు న్యాయం జరిగిందని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆరోపించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నగర అధ్యక్షుడు జావీద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అనంతరం జావీద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యతో కలిసి దివ్యాంగుల విజయ సంకల్ప యాత్ర ర్యాలీని ప్రారంభించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య, కొరివి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రకు ఘనస్వాగతం..

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆధ్వర్యాన హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చిన విజయ సంకల్పయాత్ర–2కు జిల్లా కాంగ్రెస్ దివ్యాంగుల అధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య ఆధ్వర్యాన బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కె.దయానంద్, చైతన్య, చెరుకుపల్లి శ్రీను, కోటి, సురేష్, వెంకన్న, ఉపేందర్, రాంబాబు, జాని, ఉప్పలమ్మ, సుకన్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఉద్యమకారుల ఫోరం మద్దతు

ఖమ్మం మామిళ్లగూడెం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు తెలిపారు. బుధవారం పెళ్లూరివిజయకుమార్ అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూసే బీజేపీని ఓడించి, ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. కేయూలో జరిగిన మతోన్మాద శక్తుల దాడులను ఖండించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో శంకర్ రావు, రాంబాబు, రాజేందర్, నాగేశ్వరరావు, వసీం, భాస్కర్‌రెడ్డి, పద్మాచారి, హనుమంతరావు, మోతీలాల్, వెంకట్రామయ్య, విజయ్, వరలక్ష్మి, అనంతలక్ష్మి, ధనలక్ష్మి, కృష్ణవేణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో విద్యుత్ సరఫరా సామర్థ్యం పెంపు



పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఈ, డీఈలు

ఖమ్మంవ్యవసాయం: విస్తరిస్తున్న ఖమ్మం నగరానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలోని మమతా ఆస్పత్రి రోడ్‌లోని సబ్ స్టేషన్ పరిధిలో అదనంగా మరో 5 వేల మెగా ఓల్ట్ యాంప్స్(ఎంవీఏ)తో కూడిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎన్పీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో మమతా రోడ్ సబ్‌స్టేషన్, ధంసలాపురం, అగ్రహారం, గొల్లగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లోడ్‌ను నియంత్రించవచ్చని,చెరువుబజార్, మమతా రోడ్, గొల్లగూడెం, రోటరీనగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను నియంత్రించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను బుధవారం ఖమ్మం సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎ.సురేందర్, టెక్నికల్ డీఈ బాబూరావు, ఖమ్మం డివిజన్ డీఈ నంబూరి రామారావు తదితరులు పర్యవేక్షించారు. పనుల వివరాలను ఏడీఈ రమేష్ అధికారులకు వివరించారు.